క్లుప్తంగా

11 నుంచి ఎఫ్‌ఏ-1 పరీక్షలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఏ-1 పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు బుధవారం పాఠశాలల హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు 11 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 11 నుంచి 14వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

15న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

గుడివాడరూరల్: పట్టణంలోని నెహ్రూచౌక్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఈ నెల 15వ తేదీన శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కూటమి నాయకులు గడ్డం ప్రకాష్‌దాస్, ఏసుపాదం పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న రావి, గురుమూర్తి



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి బుధవారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సమాధులకు స్థలం కేటాయించాలని వినతి

గుడివాడరూరల్: గుడివాడలో క్రైస్తవులకు సమాధుల స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు బుధవారం పాస్టర్లు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం ఆయన్ను కలసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షుడు జి.శ్యాంబాబు మాట్లాడుతూ క్రైస్తవుల సమాధులకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవ సమాధుల స్థల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు అప్పికట్ల జాషువా, జీపీ శేఖర్, రత్నాకర్, బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్య నేర్పించటంలో చిత్తశుద్ధితో పనిచేయాలి

పెదపారుపూడి: 10 మంది వయోజనులకు వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేసి, విద్య నేర్పించాలని ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ ఫేజ్-2 కార్యక్రమంపై వలంటీర్లకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ వలంటీర్లకు ఇచ్చిన సిలబస్ 100 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి-2 సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడంకి చెరువుల వేలంపాట

పమిడిముక్కల: తాడంకి పంచాయతీ పరిధిలోని రాములక్క చెరువు, గంగరాయి చెరువు, మంగళవానిగుంట చెరువుల ఫలసాయం సంబంధించి 2025-26, 2026-27, 2027-28 సంవత్సరాలకు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి భవాని తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

బలహీనంగా బందరు కాలువ కట్ట



పమిడిముక్కల: మండలంలోని ఐనంపూడి వంతెన వద్ద బందరు కాలువ కట్ట బలహీనంగా ఉంది. ఈ ప్రాంతంలో కట్ట కోతకు గురై కోసుకుపోయి ఉంది. కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు గండిపడే అవకాశం ఉంది. గతంలో ఈ ప్రాంతంలో గండిపడి నీరు పక్కనే ఉన్న మురుగుకాలువలోకి వెళ్లింది. కోతకు గురైన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు!



బందరు కాలువ వంతెన సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్డు



తోట్లవల్లూరు దళితవాడ సమీపంలో ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. కనకదుర్గమ్మ కాలనీ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద నుంచి కేఈబీ కాలువ వైపు ఉన్న కృష్ణా కరకట్ట వరకు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలల నుంచి యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణతో రోడ్డు బాగా దెబ్బతింది. ఇసుక లారీలు, ట్రాక్టర్ల తాకిడికి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై గుంతల్లో వర్షం నీరు పెద్ద ఎత్తున నిలిచిపోతోంది. ఏది రోడ్డో.. ఏది గుంతో అర్థం కాక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ పైప్‌లైన్ల భద్రతపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న బిదాన్ మహంతి

గుడివాడ టౌన్: సమాజానికి అనేక విధాలుగా ఉపయోగపడుతున్న సహజ వాయువుల పైప్ లైన్ల భద్రతకు ప్రజలే భాగస్వాములు కావాలని గెయిల్ ఇండియా లిమిటెడ్ హెచ్‌ఓడీ బిదాన్ మహంతి అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో డివిజన్ స్థాయి రెవెన్యూ, ఫైర్, పోలీస్, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ అధికారులతో సహజ వాయువుల పైప్‌లైన్ల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపులపాడు మండలం మల్లిబంధం గ్రామం నుంచి మండవల్లి మండలం పెరుగ్గూడెం వరకు 42 కిలోమీటర్ల పొడవున గెయిల్ గ్యాస్ పైప్ లైన్ ఏర్పాటు చేసిందన్నారు. దాని భద్రతపై ప్రజలు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకించి చేపలు, రొయ్యల చెరువుల యజమానులు బోర్లు వేసే సమయంలో, గ్రామాల్లో భవనాలు నిర్మించే సమయంలో, ఎలక్ట్రికల్ పోల్స్ నిర్మాణ సమయంలో అధికారుల అనుమతులు పొందాలన్నారు. వీటిపట్ల నిర్లక్ష్యం వహిస్తే భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. పైప్‌నకు ఇరువైపులా 20 మీటర్ల చొప్పున భూమి సేకరించి గెయిల్ పైప్‌ల నిర్మాణం చేపట్టిందన్నారు. వాటిపై నిత్యం డ్రోన్‌ల ద్వారా నిఘా ఉంటుందన్నారు. అయినప్పటికీ సంబంధిత రెవెన్యూ, ఫైర్, పోలీస్, వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖ, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది వీటి పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ ధీరజ్ వినీల్, ఏడీ ఫిషరీస్ ప్రసాద్, బాపులపాడు ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి తహసీల్దార్లు కిరణ్‌కుమార్, జి. కిషోర్, శ్రీను నాయక్, గెయిల్ అధికారులు బాలకృష్ణ, కృష్ణమాచారి, నిలోయ్ ముఖర్జీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న-గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా ఈ నెల 6 నుంచి 28వ తేదీ వరకు ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రధాన విద్యుత్‌లైన్లకు మాత్రమే పరిమితం అవుతుందని తెలిపారు. సాధారణ సరఫరాకు అంతరాయం ఉండబోదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందని తెలిపారు. గుడివాడ పరిసర ప్రాంత వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దుప్పట్ల అందజేత



కైకలూరు: శాంతి భద్రతలకే పరిమితం కాకుండా పోలీసు సిబ్బంది సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారు. కలిదిండి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కె.రాంబాబు దాతృత్వంతో పేదలకు దుప్పట్లు, భోజన సౌకర్యాన్ని స్టేషన్ వద్ద కల్పించారు. కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, ఎస్‌ఐ వి.వేంకటేశ్వరరావు, సహచర సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్‌ను అభినందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డీఎస్పీ ధీరజ్ వినీల్



పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుడివాడరూరల్: గుడివాడ సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ హెచ్చరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున సబ్ డివిజన్‌లోని ముగ్గురు సీఐలు, తొమ్మిదిమంది ఎస్ఐలు, 70మంది సిబ్బందితో కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ చేపట్టారు. ఈ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 25 బైక్‌లను స్వాధీనం చేసుకుని, పోలీసులు సీజ్ చేశారు. నలుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. కొత్తగా వచ్చిన మరో 20మంది నుంచి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంతో పాటు సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గుడివాడ తాలూకా, వన్, టూటౌన్ సీఐలు ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, హనీష్, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



శశి హైస్కూల్ బస్సుల డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ రవికుమార్

కైకలూరు: విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో బుధవారం ఇండో-సాక్సన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటనపై రోడ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ, పోలీసు శాఖలు సంయుక్తంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్ల లైసెన్సులను పరిశీలించారు. స్కూల్ బస్సు డ్రైవర్లుగా 60 సంవత్సరాలు నిండిన వారిని తీసుకోవద్దని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం కైకలూరులో అవగాహన సమావేశం నిర్వహిస్తామని సీఐ చెప్పారు. అదేవిధంగా కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్ అధికారులు ఆటపాక శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో బస్సులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు, రాంబాబు, సీహెచ్ రామచంద్రరావు, వీరభద్రరావు, నాలుగు మండలాల బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు స్వామి, జబ్బార్, సురేష్‌బాబు, జగదీష్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మొవ్వ: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మొవ్వ మండల శాఖ జనరల్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు సమక్షంలో బుధవారం జరిగిన ఈ ఎన్నికలకు పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ కొనసాగారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో మండల శాఖ అధ్యక్షుడిగా బి.కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బీ మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులుగా ఎండీ ఇంతియాజ్, బి.నాగమల్లేశ్వరరావుతో పాటు ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

శిథిలావస్థలో వంతెన



మండలంలోని తక్కెళ్లపాడులో తాగునీటి చెరువుకు వెళ్లే వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన పూర్తిగా దెబ్బతింది. ఎప్పుడు కూలుతుందోననే విధంగా వంతెన ఉండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వంతెనను అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మండవల్లి

స్మార్ట్ మీటర్లు రద్దు చేయండి



ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: ప్రజల పాలిట ఆర్థిక భారంగా పరిణమించే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళిరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. సక్రమంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్లను తొలగిస్తూ వాటి స్థానంలో ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ ఇందుకయ్యే వ్యయాన్ని వినియోగదారులపై మోపడం దారుణమన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకుడు దాకరపు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మట్లపూడి కనకారావు, బోయిన రాంబాబు, సీఐటీయూ నాయకుడు బుస్సా రామనాగేంద్రరావు పాల్గొన్నారు.

గోవులను రహదారులపై వదిలితే గోశాలకు తరలింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: గోవులను రహదారులపైకి వదిలితే వాటిని గోశాలకు తరలిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. రైతు బజారు ఎదురుగా ఏర్పాటు చేసిన బందిల దొడ్డిలో ఇటీవల రోడ్లపైకి వదిలిన గోవులను పంచాయతీ సిబ్బంది తరలించారు. బందిల దొడ్డిలో గోవులను ఎమ్మెల్యే కామినేని బుధవారం పరిశీలించి మాట్లాడారు. మొదటి పర్యాయంగా రూ.1,000 చెల్లించి గోవుల యజమానులు తీసుకెళ్లాలన్నారు. మరోసారి రోడ్డుపై గోవులు కనిపిస్తే గోశాలకు తరలిస్తామన్నారు. ఇందుకు గో సంరక్షణ కమిటీగా ఎంపీపీ అడివి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కమిటీకి పోలీసు, వెటర్నరీ, పంచాయతీ శాఖలు సహకరిస్తాయన్నారు. గోవులు రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను తిని వ్యాధులతో మరణిస్తాయన్నారు. రోడ్లపై పశువుల సంచారం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజల నుంచి ఎక్కువగా వచ్చిన ఫిర్యాదుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వై.ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నులిపురుగుల నివారణకు అవసరమైన మాత్రలను ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, యలమర్రు పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్రప్రసాద్ ఐసీడీఎస్ సూపర్ వైజర్స్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఈ నెల 12న నులిపురుగుల మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన అవకాశం లేని వాళ్లకు ఈ నెల 20వ తేదీన వేయనున్నట్లు తెలిపారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలి



కంకిపాడు: అధిక దిగుబడుల సాధనకు మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు వినియోగించొద్దని సూచించారు. కేవలం వ్యవసాయ శాఖ సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల బీమాకు గడువు పెంచారని, బీమా చేయించుకుని ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో కంకిపాడు, ఈడుపుగల్లు సర్పంచ్‌లు పి.ఇందిర, రమణ, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు ఎముకలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గన్నవరంరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. కళాశాల్లో జరుగుతున్న మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌లో బుధవారం వేలాది మంది విద్యార్థులు పాల్గొని మానవ శరీరం, ఆరోగ్య అవగాహనపై శిక్షణ పొందారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన విద్యాసంస్థల విద్యార్థులు 3,500 మంది ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేడు ప్రతి కుటుంబం వ్యాధులతో పోరాడుతోందని, ఆ పరిస్థితిని నివారించేందుకు అవగాహనతో వ్యాధులకు దూరంగా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయటమే తమ కర్తవ్యమన్నారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్యాణి, డాక్టర్ రాజగోపాల్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల సమగ్ర సమాచారం పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డాక్టర్‌లు విద్యార్థులకు వివరించారు.

డెంటల్ కళాశాల్లో..

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో మూడో రోజు ఎక్స్‌ప్లోర్-25 ఎగ్జిబిషన్ విద్యార్థుల సందర్శనతో సందడిగా సాగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో దంత వైద్యంలోని తొమ్మిది విభాగాలను విద్యార్థులు సందర్శించి అవగాహన చేసుకున్నారు. దంతాల ప్రాముఖ్యతను హెచ్‌వోడీలు వివరించారు. అధునాతన దంతవైద్యం అతితక్కువకే అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ కాశేశ్వరరావు, ఏఓ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు



సదస్సులో ప్రసంగిస్తున్న జ్యోతిర్మయి

చల్లపల్లి: వరినాట్లు వేసిన 35 రోజులలోపు కలుపును నిర్మూలించుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిర్మయి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మంగళాపురంలో రైతులు వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై కృష్ణా జిల్లా జల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జలవనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.పద్మజ, మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ, వీఏఏ జి.లక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పాల హారికకు నాయకుల అభినందనలు



గుడ్లవల్లేరు: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం లభించినందుకు గుడివాడ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఐదు జిల్లాలకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆమెను ఆ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఆమెను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. దీంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పార్టీ నియోజకవర్గ నాయకుడు పాలేటి చంటి, గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు శాయన రవి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత, మండల పార్టీ యువజన అధ్యక్షుడు గుదే రవి, పార్టీ నాయకులు బలుసు జితేంద్ర, కోటప్రోలు నాగు అభినందనలు తెలియజేశారు. పార్టీకి ఆమె మరిన్ని సేవలను అందించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

గుడివాడ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

గుడివాడ టౌన్: పట్టణాభివృద్ధికి మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక ఐఎంఏ హాల్లో మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత అవసరం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, ఏఈ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఏపీ గోడౌన్స్ కార్పొరేషన్ చైర్మన్ వి. గురుమూర్తి పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అవగాహన

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తుల నివారణపై అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వరదలు, తుఫానులు, ఇతర విపత్తులు వచ్చినప్పుడు ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో వివరించారు. విపత్తు సమయంలో గుండె ధైర్యంతో ఉండాలని, తమతో పాటు ఇతరులను కాపాడేందుకు ప్రయత్నించాలన్నారు. వరదల సమయంలో నీటిలో మునగకుండా ఎలా తప్పించుకోవాలో నేర్పించారు.